# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 17-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఐదు దేశాల అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ సాయంత్రం స్వీడన్‌లోని గూటెన్‌బర్గ్ నగరానికి చేరుకున్నారు.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 25న రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాలను ప్రధానం చేయనున్నారు.
- నైరుతి రుతుపవనాలు ఈ నెల 26న కేరళంను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది.
- ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

========================

ఐదు దేశాల అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు సాయంత్రం స్వీడన్‌లోని గూటెన్‌బర్గ్ నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న నరేంద్ర మోదీకి స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ స్వాగతం పలికారు. రెండు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సంబంధాలపైన, అంతర్జాతీయ పరిణామాలపైన విస్తృతంగా చర్చించనున్నారు. రెండు రోజుల స్వీడన్ పర్యటనలో నరేంద్ర మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపి, ఇరు దేశాల సంబంధాలపై సమగ్ర సమీక్ష చేయనున్నారు. వాణిజ్యం, గ్రీన్ ట్రాన్సిషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, అంకుర సంస్థలు, సరఫరా గొలుసులు, రక్షణ, అంతరిక్షం వంటి విభాగాల్లో సహకార అవకాశాలను పరిశీలించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, స్వీడన్ ప్రధాని క్రిస్టర్‌సన్, యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీ సమావేశంలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌తో కలిసి ప్రసంగించనున్నారు. అంతకుముందు నరేంద్ర మోదీ తన రెండు రోజుల నెదర్లాండ్స్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నారు. అమ్‌స్టర్ డ్యామ్ విమానాశ్రయం నుంచి ఆయన బయల్దేరే ముందు డచ్ ప్రధానమంత్రి రాబ్ జెట్టెన్ ప్రధానికి వీడ్కోలు పలికారు.

నెదర్లాండ్స్ పర్యటనలో భాగంగా రక్షణ రంగం, కీలక ఖనిజాల సరఫరాతో పాటు పలు రంగాలకు సంబంధించి ఇరు దేశాలు 17 ప్రతిష్టాత్మక ఒప్పందాలపై సంతకాలు చేశాయి.

========================

గుజరాత్ రాజధాని గాంధీనగర్ లో 700 కోట్ల రూపాయలకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఈరోజు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. గాంధీనగర్‌లోని `నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్` (NID) ప్రాంగణంలో ఏర్పాటు చేసిన `ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్`ను` కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఐడీ సంస్థ కేవలం డిజైనింగ్‌కు మాత్రమే పరిమితం కాలేదని, యువతలోని సృజనాత్మకతను వ్యాపార నైపుణ్యాలతో అనుసంధానించే వేదికని కొనియాడారు. యువత తమ సరికొత్త ఆవిష్కరణలను ప్రదర్శించడానికి, వృత్తిపరంగా ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఎన్ఐడీ వంటి సంస్థలు సరైన మార్గాన్ని చూపిస్తాయని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

========================

భారతదేశం గరిష్ఠంగా ఒకే రోజున 256.4 గిగావాట్ల (GW) విద్యుత్ డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించిందని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఒక ఆంగ్ల దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో నమోదవుతున్న మొత్తం విద్యుత్ డిమాండ్‌లో దాదాపు 33 శాతం వాటాను పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారానే అందుకోగలుగుతున్నామని తెలిపారు. దేశ ఇంధన సామర్థ్యం విస్తరించడం, గ్రిడ్ల ఆధునీకీకరణ, 'స్వచ్ఛ ఇంధనం' వాటా నిరంతరం పెరుగుతుండటమే ఈ విజయానికి నిదర్శనమని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 25న పద్మ పురస్కారాలను ప్రధానం చేయనున్నారు. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించనున్న ఈ వేడుకలో విజేతలకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులను ద్రౌపది ముర్ము అందజేస్తారని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించింది. 2026కి గాను కేంద్ర ప్రభుత్వం మొత్తం 131 పద్మ పురస్కారాలను ప్రకటించింది. వీటిలో 5 పద్మ విభూషణ్, 13 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. పురస్కార గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం గౌరవం లభించనుంది.

========================

విమాన ఇంధనంపై వాల్యూ యాడెడ్ టాక్స్ ను 25 శాతం నుంచి 7 శాతానికి తగ్గిస్తూ.. ఢిల్లీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన కేంద్రమంత్రి.. ప్రపంచ వ్యాప్తంగా విమానయాన రంగం విపరీతమైన నిర్వహణ ఖర్చులు, ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే ఇటువంటి చర్యలు విమానయాన సంస్థలకు అవసరమైన మద్దతు ఇస్తాయని, ప్రయాణికులకు విమాన ఛార్జీలు అందుబాటు ధరల్లో ఉండేందుకు ఇవి దోహదపడతాయని తెలిపారు.

విరామం

========================

బెంగళూరు - ముంబై మధ్య ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసును రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'బెంగళూరు - ముంబై వందే భారత్ స్లీపర్' సర్వీసు త్వరలోనే అందుబాటులోకి రానుందని వెల్లడించారు. బెంగళూరును హైదరాబాద్, చెన్నైతో కలిపే బుల్లెట్ ట్రైన్ కారిడార్లకు ఆమోదం లభించిందని తెలిపారు. ముంబై–బెంగళూరు–ఇతర ప్రధాన నగరాలను కలిపే రైల్వే నెట్‌వర్క్‌ను దీర్ఘకాలంలో 7 వేల కిలోమీటర్లకు విస్తరించనున్నట్లు వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - మయన్మార్ సరిహద్దుల గుండా సాగుతున్న అంతర్జాతీయ మత్తు పదార్థాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (NCB) అడ్డుకుంది. ఈ అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాకు ప్రధాన సూత్రధారి, మయన్మార్‌కు చెందిన థాన్ సిన్ తువాంగ్‌ను ఎన్‌సీబీ అధికారులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. అంతరాష్ట్ర సమన్వయం, విస్తృతమైన నిఘా, నిరంతర ఆపరేషన్ల ఫలితంగా ఈ అరెస్ట్ సాధ్యమైందని ఎన్‌సీబీ ఒక ప్రకటనలో తెలిపింది. థాన్ సిన్ తువాంగ్ పై NCBతో పాటు పలు డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు నమోదు చేసిన మాదకద్రవ్యాల కేసులు ఉన్నాయి. దర్యాప్తులో ఆయన మిజోరాం, మణిపూర్, అస్సోం, త్రిపుర మార్గంగా మాదకద్రవ్యాలను భారత్, బంగ్లాదేశ్‌లకు తరలించే క్రాస్–బోర్డర్ నెట్‌వర్క్‌లను నిర్వహించినట్లు బయటపడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వం కొలువుదీరనుంది. కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత వి.డి. సతీశన్ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేపు తిరువనంతపురంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నెల 14వ తేదీన వి.డి. సతీశన్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటిస్తూ.. కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. ఇటీవల జరిగిన కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని 'యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్' (UDF) కూటమి మూడింట రెండొంతుల కంటే ఎక్కువ మెజారిటీ సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన 'హార్మూజ్ జలసంధి'లో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారతదేశం ఖండించింది. ఇలాంటి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ప్రపంచ ఇంధన, రవాణా వ్యవస్థల పరిరక్షణపై ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక మండలి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడారు. సముద్ర మార్గాల్లో పౌర, నౌకా సిబ్బందిని లక్ష్యంగా చేసుకోవడం, అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛకు విఘాతం కలిగించడాన్ని ఏ రకంగానూ సమర్థించలేమని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ ఫీల్డింగ్ ఎంచుకోగా... బ్యాటింగ్ ప్రారంభించిన రాజస్థాన్ రాయల్స్ 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాల స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ పై 23 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు ఈ నెల 26వ తేదీన కేరళంను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. రేపు కర్ణాటకలో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వాన కురిసే అవకాశం ఉండడంతో 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, లక్షద్వీప్,

మధ్య మహారాష్ట్ర, ఒడిశాలలో రేపు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. రానున్న రెండు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులు, కేరళం, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్, ఈశాన్య భారత దేశంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =